Digital, tmedia.net.in

# టీ-మీడియా

ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 160
సంచిక : 280
పేజీలు : 3

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

శుక్రవారం, జూన్ 26, 2026


## ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

**ఆరు లక్షలు వసూలు**




**టీ.మీడియా, జూన్25, ఖమ్మం:** అబ్రాడ్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి ఆరు లక్షల వరకు వసూలు చేసి, ఇప్పుడు ఇష్టం వచ్చినట్లు చేసుకోండంటూ బెదిరిస్తున్న సలీం అనే వ్యక్తిపై చర్యలు తీసుకుని డబ్బులు ఇప్పించాలని బాధితుడు సోందుమియా ఆవేదన వ్యక్తం చేశాడు. ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సోందుమియా మాట్లాడుతూ ఖమ్మం దానవాయిగూడెంకు చెందిన ఇమామ్ కొడుకు సలీం కువైట్‌లో ఉద్యోగం చేస్తున్నాడని, తమకు తెలిసిన ఏజెన్సీకి డబ్బులు చెల్లిస్తే అబ్రాడ్ వెళ్లవచ్చని

2లో

## నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

### మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

**-ప్రధాన ఆసుపత్రి ఆకస్మికంగా తనిఖీ**



**టీ మీడియా,జూన్25, ఖమ్మం:** ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.గురువారం ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించిన మంత్రి ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, వైద్య సదుపాయాలు, పరిశుభ్రత, ఔషధాల లభ్యత, వైద్యులు, సిబ్బంది పనితీరు, తదితర అంశాలపై వైద్య అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వారి సహాయకులతో నేరుగా మాట్లాడి అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రోగులకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగి, వారి సహాయకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది రోగులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించేలా ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సూచించారు.ఖమ్మం జిల్లా ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ భవనం పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. భవనం ప్రారంభోత్సవానికి ముందే ఆసుపత్రి ప్రాంగణంలో పారిశుధ్య నిర్వహణను మరింత పటిష్ఠం చేయాలని, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఆసుపత్రికి వచ్చే ప్రధాన రహదారికి ఇరువైపులా ఆకర్షణీయమైన మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మంత్రి సూచించారు. ఆసుపత్రి ప్రాంగణంలో ఎక్కడా చెత్తాచెదారం లేకుండా పరిశుభ్ర వాతావరణం ఉండాలని, అంతర్గత రహదారులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచి గుంతలు లేకుండా అవసరమైన మరమ్మతులు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆసుపత్రుల్లో ప్రతి రోగి సంతృప్తి చెందే విధంగా సేవలు అందించాలని మంత్రి అన్నారు.అనంతరం ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఖమ్మం నియోజకవర్గంలోని విడివోస్ కాలనీలో కొనసాగుతున్న ఓటరు మ్యాపింగ్ ప్రక్రియను మంత్రి పరిశీలించారు. ఇంటింటి సర్వే, వివరాల నమోదు ప్రక్రియ పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకుని, నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా, వేగవంతంగా కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సూచించారు.అర్హులైన ప్రతి ఓటరు వివరాలు జాబితాలో నమోదయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు.ఈ తనిఖీ సందర్భంగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాల్ల దుర్గాప్రసాద్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. నరేందర్, వైద్య శాఖ అధికారులు, తదితరులు వున్నారు.

3లో



## టన్నెల్ పరిశీలించిన ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు

**-ఆగస్టు నాటికి పనులు పూర్తి చేయాలి**

**టీ మీడియా,జూన్25, సత్తుపల్లి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. గురువారం సత్తుపల్లి మండలం యాతాలకుంట వద్ద కొనసాగుతున్న టన్నెల్ నిర్మాణ పనులను సంయుక్తంగా పరిశీలించారు. టన్నెల్ నిర్మాణ పనుల పురోగతి, నాణ్యత, భద్రతా ప్రమాణాల అమలు, నిర్మాణ ప్రక్రియ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా పనుల స్థలాన్ని సందర్శించిన కలెక్టర్లు టన్నెల్ నిర్మాణ పనుల ప్రస్తుత స్థితిగతులను పరిశీలించి, చేపడుతున్న పనులపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం పూర్తయిన పనులు, మిగిలిన పనులు, నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక అంశాలు, పనుల వేగం, ఎదురవుతున్న సమస్యలు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ పనులను మరింత వేగవంతం చేసి ఆగస్టు లోపల పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడరాదని, నిర్దేశిత సాంకేతిక ప్రమాణాలు, ఇంజినీరింగ్ నిబంధనలను పూర్తిస్థాయిలో పాటించాలని సూచించారు.టన్నెల్ నిర్మాణ సమయంలో నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పనుల ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడరాదని, నిర్దేశిత సాంకేతిక ప్రమాణాలు, ఇంజినీరింగ్ నిబంధనలను పూర్తిస్థాయిలో పాటించాలని సూచించారు.ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూలి పనుల అమలులో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అన్నారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ తలెత్తే సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు.టన్నెల్ నిర్మాణానికి

3లో

## సీతారామ' పూర్తిచేస్తారా? లేదా?

- **పోరాట ఫలితంగానే 'దుమ్ముగూడెం'**
- **8 నెలలైనా 'సామినేని' హత్యకేసు తేల్చలే..!**
- **సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని**

**టీ మీడియా,జూన్25, ఖమ్మం:** ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు మహబూబాబాద్ జిల్లాలోని ఏడు లక్షల ఎకరాలను సస్యశ్యామలం చేసే సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు ధ్వజమెత్తారు. నిధులను వరదలా పారించి ప్రాజెక్టును 2026 పంద్రాగస్టు లోగా అందుబాటులోకి తీసుకొస్తామని 2024 వైరా సభ, సీతారామ పంప్ హౌస్ ల ప్రారంభం సందర్భంగా హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దానిని తుంగలో తొక్కారన్నారు. ఈనెల 30న చింతకాని మండలంలో నిర్వహించే రైతు, ప్రజా ఆశీర్వాద సభకు హాజరవుతున్న సీఎం సీతారామ ప్రాజెక్టును పూర్తిచేస్తారో లేదో? స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) పోరాట ఫలితంగానే దుమ్ముగూడెం (సీతారామ) ప్రాజెక్టు సిద్ధించిందన్నారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎంపీ తమ్మినేని వీరభద్రంతో పాటు తానూ ఈ ప్రాజెక్టు సాధనకు పాదయాత్ర చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్, కళ్యాణం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీనివాసరావుతో కలిసి బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోతినేని మాట్లాడారు.

**నెలన్నర రోజుల్లో సీతారామ' పూర్తి చేయగలరా?**

కాంగ్రెస్ ను ఆదరించిన ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా ప్రభుత్వం జిల్లాను నిరాదరణకు గురిచేస్తోందని పోతినేని అన్నారు. 2026 పంద్రాగస్టు లోగా సీతారామ ప్రాజెక్టును పూర్తిచేస్తామని స్వయంగా సీఎం పెట్టిన గడువు నెలన్నర రోజుల్లో పూర్తవుతుందని తెలిపారు. రూ.18వేల కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు కోసం రూ.8వేల కోట్లు ఇప్పటికే ఖర్చుపెట్టామని, ఇంకా రూ.10వేల కోట్లతో ప్రాజెక్టు రెండేండ్లలో పూర్తవుతుందని 2024లో సీఎం చెప్పిన మాటను వీడియో రూపంలో ప్రదర్శించారు. సీఎం పెట్టిన 2026 పంద్రాగస్టు గడువుకు ఇంకా నెలన్నర రోజులు మాత్రమే ఉంది... చేయగలరా? అని ప్రశ్నించారు. రూ.18వేల కోట్ల అంచనాలు రూ.19వేల కోట్లకు చేరాయన్నారు. సీఎం హామీ ఇచ్చిన తర్వాత రెండు బడ్జెట్లు ప్రవేశపెట్టారని, రెండింటిలో కలిపి రూ.600 కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. ముగ్గురు మంత్రులు తలా ఒక కాల్వ చొప్పున తవ్వుకుంటున్నారని తెలిపారు. శ్రీనివాసరెడ్డి మున్నేరు టూ పాలేరు లింక్ కెనాల్, తుమ్మల రాజీవ్, భట్టి జవహర్ కెనాల్స్ తవ్వుకుంటున్నారని వివరించారు. ప్రాజెక్టు పూర్తికాకుండా కాల్వలు తవ్వుకుంటే ఉపయోగం ఏంటని ప్రశ్నించారు. 2016 ఫిబ్రవరిలో కేసీఆర్ రోళ్లపాడు వద్ద ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారన్నారు. 2003లో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని దుమ్ముగూడెం ప్రాజెక్టు కోసం 2,600 కి.మీ పాదయాత్ర చేశారని తెలిపారు. 2012లో తాను జిల్లా కార్యదర్శిగా ఉన్నప్పుడు దుమ్ముగూడెం నుంచి పాలేరు వరకూ వెయ్యి మంది రైతులతో తాను పాదయాత్ర చేసిన




విషయాన్ని ప్రస్తావించారు. కృష్ణా గోదావరి అనుసంధానం కోసం ఉద్దేశించిన సీతారామ ప్రాజెక్టు విషయంలో కృష్ణా పరివాహక ప్రాంతంలో మంత్రులు కెనాల్స్ తీస్తూ పోతే ఉపయోగం ఏంటని ప్రశ్నించారు. 124 కి.మీ పొడవున్న సీతారామ ప్రాజెక్టు కెనాల్స్ లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేనాటికి 104 కి.మీ పూర్తయ్యాయని చెప్పారు. 104 కి.మీ వద్ద జూలూరుపాడు, దమ్మాయిగూడెం టన్నెల్స్ పూర్తి చేస్తే గోదావరి నీళ్లు పాలేరు రిజర్వాయర్ లో కలుస్తాయన్నారు.

3లో

## జనసేన పార్లమెంట్ కమిటీలో బేడే సతీష్‌కు స్థానం.



**టీ.మీడియా,జూన్25,చింతూరు:**జనసేన పార్టీ రాష్ట్ర నాయకత్వం అరకు పార్లమెంట్ పరిధిలో పార్టీ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ లో చింతూరు మండలానికి చెందిన యువ నాయకుడు బేడే సతీష్ ఎంపిక కావడం పట్ల జనసేన శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. పార్టీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ నాగబాబు పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన ఈ కమిటీలో రంపచోడవరం నియోజకవర్గం నుండి బేడే సతీష్‌కు అవకాశం కల్పించడం ఆయన పార్టీ పట్ల చూపుతున్న అంకితభావానికి నిదర్శనమని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బేడే సతీష్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కి, ఎమ్మెల్సీ నాగబాబు కి, పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల గుర్తింపు, సమాచార సేకరణలో నిజాయితీగా పనిచేస్తూ పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని అన్నారు. జనసేన పార్టీ అభివృద్ధి, సంస్థాగత బలోపేతంలో భాగంగా ఈ కమిటీ కీలక పాత్ర పోషించనుందని, పార్టీ నమ్మకాన్ని నిలబెట్టే విధంగా కృషి చేస్తానని బేడే సతీష్ పేర్కొన్నారు.



## నూతన దంపతులను ఆశీర్వదించిన ప్రముఖులు

**టీ మీడియా,జూన్25,సింగరేణి(కారేపల్లి):** సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు--ఉమావతి దంపతుల చిన్న కుమారుడు కొండబోయిన రాకేష్‌కు రవళితో గురువారం పండితాపురంలోని వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో వివాహం ఘనంగా జరిగింది.వివాహ వేడుకకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు,ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి,సీపీఎం ఖమ్మం,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శులు నున్నా నాగేశ్వరరావు,మచ్చ వెంకటేశ్వర్లు,రాష్ట్ర కమిటీ సభ్యులు పి.సోమయ్య,అన్నారపు కనకయ్య,బండి రమేష్,మాచర్ల భారతి,జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మెరుగు సత్యనారాయణ,బొంతు రాంబాబు,ఎర్ర శ్రీనివాసరావు,ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య,ఇల్లందు మున్సిపల్ మాజీ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లు (డీవీ), డీసీసీబీ డైరెక్టర్ మేకల మలిబాబు,మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ,సీపీఎం మండల కార్యదర్శి కె. నరేంద్ర,బీఆర్ఎస్ నాయకులు హనుమకొండ రమేష్,ఉన్న వీరేందర్,సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు భూక్య రంజిత్ కుమార్,సింగరేణి సర్పంచ్ మేదరి వీర ప్రతాప్ (టోనీ),కారేపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు భీమవరపు శ్రీనివాసరావు,ప్రముఖ న్యాయవాది రమేష్ కుమార్ మక్కాడ్‌తో పాటు పలువురు అధికారులు,ప్రజాప్రతినిధులు,వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి,వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో నిండాలని ఆకాంక్షించారు.




## వెంకట్యతండాలో ఉచిత ఆరోగ్య శిబిరం

**టీ మీడియా,జూన్25,సింగరేణి(కారేపల్లి):**సింగరేణి మండలం వెంకట్యతండాలో గురువారం ది గాడ్ థెరిస్సా మహిళా మండలి,వైఆర్‌జీకే ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా సింగరేణి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బి.సురేష్,వైద్య సిబ్బంది బిందు,ది గాడ్ థెరిస్సా మహిళా మండలి ప్రాజెక్ట్ మేనేజర్ మైఫా వెంకటేశ్వర్లు,వైఆర్‌జీకే స్కీమ్ లింక్ వర్కర్ ఆదెర్ల శంకర్ మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్, హెపటైటిస్ ,క్షయవ్యాధి(టీబీ), లైంగిక వ్యాధులపై ప్రజలకు అవగాహన కలిగి ఉండాలని సూచించారు.అదేవిధంగా బ్రేక్ ఫ్రీ యాప్,సెల్ఫ్ రిస్క్ అసెస్‌మెంట్ వినియోగంపై వివరించారు.హెచ్ఐవీ వంటి వ్యాధులను నివారించడంలో అవగాహన ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.ఏవైనా అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించి,వైద్యుల సూచించిన మందులను క్రమం తప్పకుండా వాడితే అనేక వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. అనంతరం శిబిరంలో హెచ్ఐవీ,హెపటైటిస్, మధుమేహం(షుగర్) పరీక్షలు నిర్వహించడంతో పాటు ఇతర సాధారణ వ్యాధులకు కూడా ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు విజయ,కృష్ణవేణి,జీఎన్ఎంలు విజయలక్ష్మి,రాధ పాల్గొన్నారు.

# దరఖాస్తులు గడువులో పరిష్కరించాలి

**-జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**



**టీ మీడియా,జూన్25, ఎర్రుపాలెం :**ప్రజలకు ప్రభుత్వ సేవలు పారదర్శకంగా, వేగవంతంగా అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.గురువారం సాయంత్రం మధిర నియోజకవర్గం ఎర్రుపాలెం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి కార్యాలయ పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలను సమగ్రంగా పరిశీలించారు. మండల పరిధిలోని మొలుగుమాడు గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు కింద నిర్వహించిన రీసర్వే వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రీసర్వే అనంతరం రైతులకు నూతన పాసుపుస్తకాల జారీ ప్రక్రియపై అధికారులతో చర్చించి అవసరమైన సూచనలు చేశారు.అదేవిధంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమం పురోగతిపై ఆరా తీశారు. ఓటరు జాబితాల సవరణ ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇంటింటి సర్వే, ఫారాల పంపిణీ, వివరాల సేకరణ వంటి కార్యక్రమాల్లో ఎలాంటి లోటుపాట్లు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న వివిధ దస్త్రాలు, స్లాట్ బుకింగ్, రిజిస్ట్రేషన్లు, సాదా బైనామా దరఖాస్తులు, భూ భారతి దరఖాస్తుల స్థితిగతులను సమీక్షించారు. ప్రజలకు సంబంధించిన భూ సమస్యలు ఎక్కువకాలం పెండింగ్‌లో ఉండకుండా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు.కార్యాలయంలోని వివిధ విభాగాలను సంబంధించిన కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాలు, రేషన్ కార్డులు, ఇతర సేవలకు సంబంధించిన దరఖాస్తుల పరిష్కారంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందించే సేవల విషయంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.భూ వివాదాలకు సంబంధించిన దరఖాస్తులను సాధ్యమైనంత వరకు మండల స్థాయిలోనే సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని, ప్రజలు జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే సేవలు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. మండల కార్యాలయాలకు వచ్చే ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులో పరిష్కరించి ప్రజల ఇబ్బందులను తగ్గించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సునీత ఎలిజబెత్, డిప్యూటీ తహసీల్దార్ జ్యోతి, ఆర్ఐ శిరీష, సర్వేయర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.




## త్రాగునీటి బోరు ఏర్పాటు

**టీ.మీడియా, జూన్25, చింతూరు:**మండలంలోని మధుగూరు గ్రామంలో త్రాగునీటి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామస్తుల అభ్యర్థన మేరకు జేకేసీటీ చైర్మన్, చింతూరు మండల టీడీపీ అధ్యక్షులు మొహమ్మద్ జమాల్ ఖాన్ ఆధ్వర్యంలో త్రాగునీటి బోరు ఏర్పాటు చేశారు. గ్రామంలో కొంతకాలంగా త్రాగునీటి కొరత నెలకొని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితిని గుర్తించిన జేకేసీటీ చైర్మన్ ఎం.డి. జమాల్ ఖాన్ వెంటనే స్పందించి బోరు ఏర్పాటు చేయించారు. ఈ బోరు ద్వారా గ్రామ ప్రజలకు త్రాగునీటి సమస్యకు గణనీయమైన ఉపశమనం లభించనుండటంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎం.డి. జమాల్ ఖాన్ మాట్లాడుతూ, గ్రామ ప్రజల మౌలిక అవసరాల్లో అత్యంత ముఖ్యమైన త్రాగునీటి సమస్య పరిష్కారానికి తమ వంతు బాధ్యతగా ఈ బోరును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామస్తులు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, నీటి వృథాను నివారించాలని, బోరు దీర్ఘకాలం ఉపయోగపడేలా అందరూ బాధ్యతతో సంరక్షించాలని సూచించారు.జేకేసీటీ ప్రజల అవసరాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తుందని, భవిష్యత్తులో కూడా ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను చేపడుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు,సావిత్రి, సత్తిబాబు, సుమ్మన్, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

నమ్మబలికినట్లు తెలిపారు. తన అల్లుళ్లకు ఉద్యోగం వస్తుందనే ఆశతో సలీం చూపించిన కన్సల్టెన్సీ వారి ఖాతాకు తన సతీమణి పేరుతో ఎస్‌బిఐ బ్యాంక్ నుండి దఫాల వారీగా గబుదాబీ కమర్షియల్ బ్యాంక్ ఖాతా నెంబర్‌ఏఇ310030000499477208001కు ఇద్దరికి చొప్పున ఆరు లక్షలు చెల్లించినట్లు తెలిపారు. ఆరు నెలలైనా ఉద్యోగం ఇవ్వకపోవడంతో తమ డబ్బులు ఇవ్వాలని అడుగగా తనకు ఇవ్వలేదు, కన్సల్టెన్సీ వారిని అడగండి అంటూ బెదిరిస్తున్నాడని తెలిపారు. కన్సల్టెన్సీ వారిని అడుగగా తమకేం సంబంధం లేదని, సలీంను అడగాలని చెప్పినట్లు తెలిపారు. ఇటీవలనే సలీమ్ ఖమ్మంవచ్చాడని, తాము నిలదీయగా మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండంటూ బెదిరింపు ధోరణితో మాట్లాడాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తమను మోసం చేసిన సలీమ్‌తో పాటు అతని తండ్రి ఇమామ్‌పై చర్యలు తీసుకుని తమ డబ్బుల్ని తమకు ఇప్పించాలని వేడుకున్నాడు. లేకుంటే తనకు చావే గతి అని, తాను వడ్డీకి అప్పుతెచ్చి డబ్బులు ఇచ్చినట్లు వాపోయాడు. ఈ సమావేశంలో సోందుమియా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# సింగరేణిలో ఎస్ఐఆర్ కార్యక్రమం ప్రారంభం

**టీ మీడియా,జూన్25,సింగరేణి(కారేపల్లి):**ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్-- స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమాన్ని సింగరేణి గ్రామపంచాయతీలో గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా అర్హులైన ప్రతి ఓటరికి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసి, ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా,తప్పులులేకుండా రూపొందించేందుకు చర్యలు చేపట్టారు.ఓటరు జాబితాలో కొత్తగా పేర్ల నమోదు,మార్పులు,సవరణలు,తొలగింపులకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మేదరి వీరప్రతాప్ (టోనీ) మాట్లాడుతూ,ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని,గ్రామంలోని ప్రతి అర్హుడు తమ వివరాలను సరిచూసుకుని అవసరమైన సవరణలు చేసుకోవాలని కోరారు.పేరు,చిరునామా లేదా ఇతర వివరాల్లో మార్పులు ఉన్నవారు సంబంధిత ఫారాలను బీఎల్‌వోల ద్వారా సమర్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో ఓరుగంటి వెంకటేశ్వర్లు,కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తోటకూరి రాంబాబు, గ్రామపంచాయతీ కార్యదర్శి బి.నెహ్రు,బీఎల్‌వోలు,గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజలందరూ సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## సీఎం సభకు నేడు పాలేరు సన్నాహక సమావేశం

**ఈ మీడియా ,జూన్ 25 ,కూసుమంచి:** ఈ నెల 30వ తేదీన చింతకాని మండలం లచ్చ గూడెంలో జరుగనున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పాల్గొను బహిరంగ సభను విజయవంతం చేసేందుకు శుక్రవారం పాలేరు నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశం జరుగునుంది. రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయం ( కూసుమంచి ) నందు ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని కూసుమంచి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బజ్జూరి వెంకటరెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ, జిల్లా నాయకురాలు మద్దినేని స్వర్ణ కుమారి, మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయం ఇన్చార్జి తంబూరి దయాకర్ రెడ్డి హాజరుకానున్నట్లు ఆయన చెప్పారు. ఈ సన్నాహక సమావేశానికి పాలేరు నియోజకవర్గ పరిధిలోని నేలకొండపల్లి, ఖమ్మం ( రూరల్ ), తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ముఖ్య నాయకులు పాల్గొననున్నారు. కావున కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రజా ప్రతినిధులు, మంత్రి పొంగులేటి అభిమానులు,సకాలంలో హాజరై విజయవంతం చేయాలని వెంకటరెడ్డి కోరారు.

# అభివృద్ధిని అడ్డుకుంటున్నఅటవీశాఖ

-విద్యుత్ లైన్ మరమ్మత్తును అడ్డగింత



**టీ.మీడియా,జూన్ 25,చింతూరు:**చింతూరు మండలం ఏడుగురాళ్లపల్లి పంచాయతీ లోని చల్లకవ్వం గ్రామం లో 30 కొండ రెడ్డి కుటుంబాలు, ఉప్పన పల్లి గట్టు గ్రామంలో సుమారు 40 కుటుంబాలు నివసిస్తున్నారు. ఎన్నో ఏళ్ల నుండి ఉన్న కరెంట్ విద్యుత్ స్తంభాల స్థానంలో మరమ్మతులు నిర్వహించి కొత్త స్తంభాలు వేయడానికి విద్యుత్ శాఖ పనులు ప్రారంభించింది. అటవీశాఖ అధికారుల అత్యుత్సాహం తో విద్యుత్ లైన్ మరమ్మతుల పనులను అడ్డగించారు. కొండరెడ్ల గ్రామలను అభివృద్ధి చేయాలని , సంకల్పంతో కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వ లు వాళ్లకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తుంటే అటవీశాఖ వాళ్ల అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నారు. అటవీశాఖ పని తీరు చూస్తుంటే ప్రజల నుంచి ఆగ్రహానికి గురి చేస్తున్నాయి . సుమారు 40 సంవత్సరాల క్రితం వేసిన విద్యుత్ లైన్ ప్రమాదకరంగా ఉండడంతో మరమ్మత్తు కు ఆదేశించిన విద్యుత్ శాఖ పనులను అటవీ అధికారులు ఆదివాసి ప్రాంతాల్లో అభివృద్ధికి మోకాలు అడ్డం వేస్తున్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కరెంట్ లేని ఆదివాసీ గూడెలకు కరెంట్ సౌకర్యం కల్పించాలి అనే ఆదేశాలు ఉన్నప్పటికీ ఆ ఆదేశాలను బేఖాతరు అధికారులు బేఖాతరు చేస్తున్నారు. ఇప్పటికైనా ఐటీడీఏ పీఓ శుభం నొక్వల్ స్పందించి కొండ రెడ్డి ఆదివాసీ కుటుంబాలలో వెలుగులు నింపాలని కోరుతున్నారు. ఈ సమస్యను ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీ ఎడమ అర్జున్ ఆధ్వర్యంలో ఐటీడీఏ ఏపీవో సుజాతకు మెమొరాండం సమర్పించారు. ఈ విషయం గురించి అటవీశాఖ అధికారులు తో మాట్లాడి సమస్యను పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు . ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సవలం సత్తిబాబు, ఉప సర్పంచ్ బి బాబురావు, గ్రామస్తులు కదల సుధాకర్ రెడ్డి, కదల రామిరెడ్డి, ఉయిక బాబు, ముత్తయ్య, మహేష్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.



## ఫెర్టిలైజర్ షాపులను తనిఖీ చేసిన ఏడీఏ

**యూరియా కొరత లేదు..**

**రైతులు ఆందోళన చెందొద్దు**

**టీ మీడియా.జూన్25,సింగరేణి(కారేపల్లి):**ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలోని ఎరువుల దుకాణాలు,సొసైటీ ఫెర్టిలైజర్ విక్రయ కేంద్రాలను వైరా ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ గురువారం తనిఖీ చేశారు.కారేపల్లి,సీతారాంపురం,కొమట్లగూడెంలోని సొసైటీ ఫెర్టిలైజర్ సేల్ పాయింట్లతో పాటు గోదాంను పరిశీలించి,యూరియా నిల్వలు,పీవోఎస్(పిఓఎస్) యంత్రం ద్వారా నమోదవుతున్న వివరాలు,ఫెర్టిలైజర్ యాప్‌లో స్టాక్ నమోదును తనిఖీ చేశారు.ఈ సందర్భంగా స్టాక్ వచ్చిన వెంటనే పీవోఎస్ యంత్రంతో పాటు ఫెర్టిలైజర్ యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు.అనంతరం ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ మాట్లాడుతూ రైతులకు యూరియా కొరత లేకుండా అన్ని సొసైటీ విక్రయ కేంద్రాల్లో తగిన నిల్వలు ఉంచుతున్నామని తెలిపారు.రైతులు వర్షాలు కురిసి భూమిలో తగిన తేమ ఏర్పడిన తర్వాత మాత్రమే విత్తనాలు విత్తాలని సూచించారు.గ్రామాలకు వచ్చి విక్రయించే గుర్తు తెలియని వ్యక్తుల వద్ద విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని హెచ్చరించారు.లైసెన్స్ పొందిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేసి,వాటి రశీదులను పంట చేతికి వచ్చే వరకు భద్రంగా ఉంచుకోవాలని సూచించారు.ఈ తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారి బట్టు అశోక్ కుమార్,ఏఈవో నరేష్,సొసైటీ కార్యదర్శి బొల్లు హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



## గ్రీన్‌ఫీల్డ్ హైవేపై ఘోర ప్రమాదం

- **టైరు పేలి రైలింగ్‌ను ఢీకొన్న కారు..**
- **మంటల్లో దగ్ధం**
- **సీటు బెల్టులే ఏడుగురు**

**యువకులకు ప్రాణరక్షకాలు**

**టీ.మీడియా,జూన్25, వేంసూరు**

మండల పరిధిలోని గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో పెను విషాదం తృటిలో తప్పింది. హైదరాబాద్ నుంచి ఎర్రవరం వైపు కారులో ప్రయాణిస్తున్న ఏడుగురు యువకులు సకాలంలో అప్రమత్తమవడంతో ప్రాణాలతో బయటపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వేగంగా వెళ్తున్న కారు వేంసూరు ఎగ్జిట్ సమీపానికి చేరుకోగానే ముందు టైరు ఒక్కసారిగా పేలింది. దీంతో వాహనం అదుపుతప్పి రహదారి పక్కనున్న రైలింగ్‌ను బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న సమయంలో ఏర్పడిన రాపిడి కారణంగా కారు ఇంజిన్ భాగంలో మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు వాహనం మొత్తానికి వ్యాపించడంతో కారులో ఉన్న యువకులు వెంటనే బయటకు దూకి ప్రాణాలు దక్కించుకున్నారు. ప్రమాద సమయంలో యువకులంతా సీటు బెల్టులు ధరించి ఉండటంతో స్వల్ప గాయాలతోనే బయటపడ్డారని సమాచారం. అయితే మంటలు తీవ్రరూపం దాల్చడంతో కారు పూర్తిగా దగ్ధమైంది. ప్రమాద సమాచారం అందుకున్న స్థానికులు, పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.

ఈ ఘటనతో కొంతసేపు హైవేపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సీటు బెల్టు వినియోగం ఎంత ముఖ్యమో ఈ ప్రమాదం మరోసారి నిరూపించిందని స్థానికులు పేర్కొన్నారు.



## చింతకాని పీహెచ్‌సీ డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ

**టీ.మీడియా,జూన్25, చింతకాని**

ఖమ్మం డీఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ రామారావు చింతకాని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు చేపట్టిన సన్నాహాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పల్స్ పోలియో వ్యాక్సిన్ నిల్వలు, కోల్డ్ చైన్ నిర్వహణ, పోలియో బూతుల ఏర్పాటు, సిబ్బంది నియామకం, అవగాహన కార్యక్రమాల అమలును సమీక్షించారు. ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలు రికార్డులు, ఔషధ నిల్వలు పరిశుభ్రత, రోగులకు అందుతున్న సేవలను కూడా పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతోపాటు, ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ఎండి అల్తాఫ్, డాక్టర్ ఎం.శ్రీదేవి, డాక్టర్ సోహెల్, సూపర్వైజర్లు ఇస్మాయిల్, కనకతార, యుడిసి పల్లవి ఫార్మసిస్టులు సిరాజ్, శ్రీనివాసు స్టాఫ్ నర్స్ అరుణ, పిహెచ్సి సిబ్బంది పాల్గొన్నారు.

**ఎంపిహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్**

మండల కేంద్రంలోని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ పరాస్ కుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ విభాగాలు వార్డులను, ఔట్ పేషెంట్ ఓపి, ఇన్ పేషెంట్ ఐపి సేవలను పరిశీలించారు. ఆసుత్రిలో నిర్వహిస్తున్న ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన రిజిస్టర్లను, రికార్డులు క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, మందుల నిల్వలు, పారిశుద్ధ్య నిర్వహణ, సిబ్బంది హాజరు, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఆస్పత్రిలో ఉన్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న సేవలను గురించి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆరోగ్య పథకాలు, ప్రజలకు సమర్థవంతంగా చేరేలా అధికారులు, వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.

## టన్నెల్ పరిశీలించిన

సంబంధించిన భద్రతా చర్యలు, మార్జిన్ సేఫ్టీ అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని, నిర్మాణ నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాలని కలెక్టర్లు ఆదేశించారు. ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరే విధంగా నాణ్యమైన నిర్మాణాన్ని అందించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ పరిశీలనలో ఇరిగేషన్ శాఖ టన్నెల్ అండ్ సేఫ్టీ కార్యదర్శి కల్నల్ పరిక్షిత్ మెహ్రా, చీఫ్ ఇంజనీర్ ఎస్. శ్రీనివాస్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. కృష్ణ, సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## సీతారామ' పూర్తిచేస్తారా? లేదా?

సీతారామ ప్రాజెక్టును పూర్తి చేస్తారా? లేదా? స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌ను ఆదరించిన ఖమ్మం జిల్లాలో ఓ ప్రాజెక్టు పూర్తి చేశారా? ఓ పరిశ్రమ, ఓ యూనివర్శిటీ స్థాపించారా? అని నిలదీశారు. ఏమి చేశారని రైతులు, ప్రజలు ఆశీర్వదించాలని ప్రశ్నించారు. ఎల్ నినో ఎఫెక్ట్ నేపథ్యంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతున్న దృష్ట్యా వేసిన పంటల్లో 30శాతం విత్తనాలు మొలకెత్తలేదన్నారు. ఈ నేపథ్యంలో గోదావరి నీళ్లు రాకపోతే ఏంటి పరిస్థితి? అని సీఎంను ప్రశ్నించారు. ఈ ఏడాది బడ్జెట్లో రూ.22వేల కోట్లు నీటిపారుదల ప్రాజెక్టులకు కేటాయిస్తే దీనిలో కేవలం రూ.360 కోట్లు సీతారామకు కేటాయించటం సిగ్గు చేటన్నారు. 2026 ఖరీఫ్ రైతుభరోసా నిధుల విడుదల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖమ్మం జిల్లాకు రావడాన్ని స్వాగతిస్తున్నామని పోతినేని తెలిపారు. కానీ 2024, 2025 రబీ రైతుభరోసా నిధులు ఇస్తారో... లేదో స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు. పంటలు వేయడానికి ఇచ్చే రైతుభరోసా నిధులను సంవత్సరాల కొద్దీ పెండింగ్ పెట్టడాన్ని తప్పుబట్టారు.